అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 04 ఫిబ్రవరి 2023

ఆటో డ్రైవర్ కుటుంబానికి సాయం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు చెల్ల విక్రం ఆధ్వర్యంలో శుక్రవారం పేద ఆటో డ్రైవర్ రవి కుటుంబానికి 25కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులో నివసిస్తున్న రవి కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని 25 కేజీల బియ్యాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గోలేటి శివ, శనిగారపు రాయలింగు, బానోతు రాజు నాయక్, జాడి విక్రమ్, కుంభం మల్లేష్, వేల్పుల రమేష్, సురేష్ పాల్గొన్నారు.



పేద విద్యార్థికి ఉచిత చికిత్స

తాంసి : మండలంలోని గిరిగామ గ్రామానికి చెందిన మైనార్టీ పేద కుటుంబానికి చెందిన రజబలి కుమారునికి కొన్ని రోజుల క్రితం పాదం దగ్గర ఫ్యాక్చర్ అయింది. చికిత్సకు తాంసి గ్రామానికి చెందిన వైద్యుడు, వన్నెల ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ సాయం చేశారు. శుక్రవారం మంచిర్యాలలో ఉన్న తన హాస్పిటల్‌కు కారులో విద్యార్థితో పాటు తండ్రిని వెంట తీసుకెళ్లి సొంత ఖర్చులతో ఆపరేషన్ చేసి వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పేదలకు తన వంతు వైద్యంతో పాటు మందులను ఉచితంగా అందిస్తానని తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులు డాక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



సమస్యలపై సమరం..పోరాటమే మార్గం..!

- ఆదివాసీ గిరిజన విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా
- సంఘటితంతో సమస్యల పరిష్కారానికి కృషి
- రేపటి నుంచి ఆదిలాబాద్‌లో టీఏవీఎస్ రాష్ట్ర రెండో మహాసభలు
- హాజరుకానున్న వివిధ జిల్లాల విద్యార్థులు, ప్రతినిధులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదివాసీ గిరిజన విద్యార్థుల చదువుతో పాటు వారి సంక్షేమం..వసతుల కల్పనే లక్ష్యంగా పోరుబాటులో సాగుతోంది తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్). చదువులో వెనుకబాటు తనం పారద్రోలేందుకు..ఆ పేద విద్యార్థులకు ప్రభుత్వాలు కల్పించాల్సిన సౌకర్యాలు..దక్కాల్సిన హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తోంది. వారి సమస్యల పరిష్కారమే ఏజెండాగా ముందుకు సాగుతోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అనేక విజయాలను సొంతం చేసుకొని ఆదివాసీ విద్యార్థులకు తామెల్లప్పుడూ అండగా ఉంటామని చాటిచెబుతోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2015లో ఆవిర్భవించిన ఈ సంఘం పేద విద్యార్థుల పాలిట ఉద్యమ గొంతుకై నిలుస్తోంది. ఈ సంఘం రాష్ట్ర రెండో మహాసభలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రం వేదికగా ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఆది, సోమ రెండు రోజుల పాటు ఈ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.



విద్యార్థుల కోసం అనేక పోరాటాలు

ఆదివాసీ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా టీఏవీఎస్ అనేక పోరాటాలు నిర్వహించింది. గిరిజన విద్యారంగ సమస్యలపై అనేక వేదికల్లో గళమెత్తింది. దశలవారీ పోరాటాలు చేపడుతూ ప్రభుత్వాలను, అధికార యంత్రాంగాన్ని కదిలించడంలో సఫలీకృతులైంది. గిరిజన సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కళాశాలలు, యూనివర్సిటీ సమస్యలు తదితర వాటిపై నిరంతరం పోరాటం చేసింది. జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని చేపట్టిన పోరాటాల్లో ఈ సంఘం కీలకపాత్ర పోషించింది. ఈ సందర్భంగా పలు పోలీసు కేసులను కూడా ఎదుర్కొన్న సంఘటనలున్నాయి. జీఓ నెం.3రద్దుకు వ్యతిరేకంగా జిల్లావాసులను కదిలించేలా పెద్ద ఎత్తున పోరాటం చేపట్టడం.. ఇందులో భాగంగా రెండు సార్లు జిల్లా బంద్ వంటి కార్యక్రమాలు చేపట్టింది. పోరాటాలతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను పెంపొందించడంలోనూ పలు కార్యక్రమాలు చేపట్టింది. మూఢనమ్మకాలను దూరం చేసేందుకు మ్యాజిక్‌షో(సైన్స్ ప్రదర్శన)వంటివి చేపట్టారు. ఆయా కళాశాలలు, పాఠశాలలు తిరుగుతూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల్లో వార్షిక పరీక్షల పట్ల భయం దూరం చేసేందుకు ప్రతి ఏటా టాలెంట్ టెస్టు నిర్వహిస్తూ వారిలో మనోధైర్యం నింపుతోంది. విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అనేక విజయాలు సొంతం..!

విద్యార్థుల కోసం చేపట్టిన పోరాటాల క్రమంలో అనేక విజయాలను టీఏవీఎస్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భవనాలు, కళాశాల వసతిగృహాల కోసం నూతన భవనాలు నిర్మించడం కోసం అనేక ఉద్యమాలు చేపట్టింది. దీంతో ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి నూతన భవనాలు నిర్మించారు. మరోపక్క ప్రతి ఏటా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులకు బాసటగా నిలిచేలా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో దోమ తెరలను పంపిణీ చేయించడంలో విజయం సాధించింది. దీంతో ఆదివాసీ విద్యార్థులు దోమల బాధలకు దూరమయ్యేందుకు సంఘం కృషిచేసింది. వీటితో పాటు పాఠశాలలు, కళాశాలల్లో టాయిలెట్ల నిర్మాణం మెస్ ఛార్జీలపెంపుతో పాటు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు సైతం పోరాటాల ఫలితంగా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

విద్యారంగ సమస్యలపై పోరాటం : పూసం సచిన్, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి



ఆదివాసీ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేపట్టాం. తాజాగా నిర్వహించే మహాసభల్లోనూ ఆయా సమస్యలపై చర్చించడం జరుగుతుంది. గిరిజనుల్లో వందశాతం అక్షరాస్యత పెంపొందించడం, విద్యార్థుల డ్రాపౌట్‌ను తగ్గించడం, ఉన్నత విద్య అవకాశాలను మెరుగుపర్చడం వంటి వాటిపై ప్రణాళిక రూపొందించనున్నాం. తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలను నిర్మిస్తాం. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలి.

జామ్ గురుకులంలో విద్యార్థిని మృతి



- మృతిపై తల్లిదండ్రుల అనుమానం
- విద్యార్థి సంఘాల ఆందోళన



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం 5వ తరగతి విద్యార్థిని మహిత ఆకస్మికంగా మృతి చెందింది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది గుండెపోటుతో మృతి చెందిందని పేర్కొంటుండగా తల్లిదండ్రులు, బంధువులు ఇంత చిన్న వయసులో గుండెపోటు ఏంటని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థులను రెగ్యులర్‌గా నర్సు చూస్తున్నప్పుడు గుండెపోటు అంటే ఎలా నమ్మాలని సోన్ మండలం పాక్‌పట్ల గ్రామానికి చెందిన విద్యార్థి తండ్రి ఇప్ప భూమేష్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. విషయం తెలిసిన విద్యార్థి సంఘాల నాయకులు హాస్టల్ ముందు ఆందోళన చేశారు. హాస్టల్‌లో విద్యార్థిని మృతి చెందింతే బయటకు పొక్కకుండా చూసుకునే యాజమాన్యం తీరు సరిగా లేదని ఆరోపించారు. పోలీసులు ఆందోళనకారులకు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టైర్ బ్లాస్ట్ అయి కారు బోల్తా



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో కారు టైర్ బ్లాస్ట్ అయి బోల్తా పడింది. రామాయి గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీలత ఎప్పటిలాగే శుక్రవారం జిల్లా కేంద్రం నుండి కారులో పాఠశాలకు వెళ్తుండగా రాంపూర్ గ్రామ సమీపంలో టైర్ బ్లాస్ట్ కావడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఉపాధ్యాయురాలికి ఎలాంటి గాయాలు కాకుండా బయట పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

వంతెన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ - కౌటాల

మండలంలోని వైగాం గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ మెరుగైన రవాణా సౌకర్యం కోసం ప్రభుత్వం వంతె నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నిధుల నుండి రూ.2.4 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ వంతెన పూర్తయితే చింతలమానెపెల్లి నుండి గుండాయిపేట్ వరకు కౌటాలకు రాకుండానే వెళ్లడానికి వీలుపడుతుందని, దూరభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, మధూకర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

మత్స్య శాఖ ఏడీకి గంగపుత్ర సంఘం సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

బదిలీపై వెళ్తున్న మత్స్యశాఖ ఏడీ విజయ్‌కుమార్‌ను శుక్రవారం గంగపుత్ర సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు సర్వసాధారణమన్నారు. అయినప్పటికీ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉండే విధంగా అధికారులు పని చేయాలని కోరారు. రానున్న రోజుల్లో సంఘం సభ్యులందరూ ఐకమత్యంగా ఉండి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగపరచుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు స్వామి, శ్రీనివాస్, వెంకటి, ఆశన్న, నర్సిములు, పొచ్చన్న, శంకర్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు గట్టు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరిమల జూనియర్ కళాశాలలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అధ్యాపకులు పాత్ర క్రియాశీలమైనదన్నారు. తెలంగాణ వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా అధ్యాపకుల సమస్యలు తీరలేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం కార్యదర్శి దండవేణి శ్రీనివాస్, సలహాదారులు ముత్యం రాకేష్, బండారి రాములు, గుర్రం రవి, ఆవుల రాజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

6న ఆర్‌ఎల్‌సీ ఆఫీస్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలంటూ హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌సి ఆఫీస్ వద్ద ఫిబ్రవరి 6న నిర్వహించే ధర్నాను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్ అధ్యక్షతన శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా గుర్తింపు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ హైకోర్టులో ఏఐటీయూసీ కేసు వేస్తే మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యానికి, ఆర్‌ఎల్‌సికి ఆదేశాలు ఇచ్చినా ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఫిబ్రవరి 18 నాటికి మూడు నెలల గడువు ముగిస్తుందని, ఈ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో సింగరేణి యాజమాన్యం, ఆర్‌ఎల్‌సిపై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేయడానికి వెనకడబోమని హెచ్చరించారు. 11వ వేజ్ బోర్డులో కార్మికులకు మెరుగైన వేతనాలు పెరిగేలా కృషి చేశామని, త్వరలో జరిగే సమావేశంలో అలవెన్స్, ఎల్టిటిసిలు, ఇంక్రిమెంట్లపైన చర్చలు జరిపి అన్ని రకాల అలవెన్స్‌లు పెరుగుదలకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి గుడిగంటి నర్సింగరావు, ఆఫీస్ బేరర్స్ గజ్జి రమేష్, సంపత్, పిట్ సహాయ కార్యదర్శి సందీప్, నాయకులు జిపి రావు అక్బర్ పాషా, శంకరయ్య, నారాయణ, శ్రీధర్, మల్లేష్, తిరుపతిరెడ్డి, నంబయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



నవతెలంగాణ-తాండూర్

రైతుల సమస్యలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ అన్నారు. శుక్రవారం కాసిపేట గ్రామంలో పత్తి ధర క్వింటాల్‌కు రూ.12000 చెల్లించాలని రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా పడటంతో పత్తి పంట దెబ్బతిని దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చిందన్నారు. అధిక వర్షాల వల్ల రెండు మూడు సార్లు విత్తనాలు విత్తడం, కలుపు సమస్యతో పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని తెలిపారు. వాతావరణ ప్రభావం వల్ల పురుగుమందులు ఎక్కువ వాడాల్సి రావడంతో పెట్టుబడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9300 ఉండగా, ఇప్పుడు రూ.7500 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రేటు పెంచుతుందని పత్తిని ఇండ్లలోనే పెట్టుకొని ఎదురు చూస్తున్నారన్నారు. ప్రస్తుత ధరతో రైతులకు పెట్టుబడి సైతం రాలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోయాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి పత్తికి ధర పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దాగం రాజారాం, ముదం శంకర్, ఆవుల పుల్లయ్య, వేల్పుల అంకుల్, ఆవుల సాంబయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెదిలి, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ డిపో ఆవరణలో అద్దె బస్సు డ్రైవర్ల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రయాణికులు దేవుళ్లని, వారితో మర్యాదగా మెదలాలన్నారు. బస్సు నడిపే సమయంలో సెల్ ఫోన్‌లో మాట్లాడకూడదని, ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్, ఎమ్ఎఫ్ మధుసూదన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్ రసూల్, అద్దె బస్సుల డ్రైవర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో కనిపించని అభివృద్ధి



జైనథ్ : బీఆర్ఎస్ హయాంలో మండల కేంద్రంలో అభివృద్ధి కనిపించడం లేదని బిజెపి నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. మండలానికి చెందిన నాయకులు జోగు రామన్న ఎమ్మెల్యేగా 14 సంవత్సరాలు గడుస్తున్నా మండలాన్ని అభివృద్ధి చేయలేకపోయారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించారు. ముందుగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో అభివృద్ధి ఎక్కడ కనపడడం లేదని, రూ.4వేల కోట్లతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే ఒకసారి మండల కేంద్రంలో తిరిగి సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు. జిల్లాలోనే పురాతన ఆలయం అయిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఆలయాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు వృథా చేశారని, ఇప్పటివరకు ఒక్క ఇంటికి కూడా మంచినీరు అందించలేకపోయారని అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సంవత్సరాలు గడుస్తున్నా మూత్రశాలల నిర్మాణం పూర్తి చేయలేక పోయారని, మినీ స్టేడియ నిర్మాణం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు. ఆమె వెంట జైనథ్ ఉప సర్పంచ్ రాకేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చిల్క చిన్నన్న, నూకల లస్మన్న, బిక్షి సంతోష్, లక్కం రమేష్, ప్రతాప్‌రెడ్డి, ఊశన్న, సతీష్‌రెడ్డి ఉన్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుధ్య పనులు చేపట్టాలి



నవతెలంగాణ-జైపూర్

మహాశివరాత్రిని పురస్కరించుకొని వేలాల మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌పిఓ ప్రభాకర్‌రావు ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం వేలాల గ్రామపంచాయతీ సర్పంచ్ శ్యామలలక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ నెల 18 మహాశివరాత్రి పర్వదినం నుండి మొదలు మూడు రోజులపాటు కొనసాగే జాతరకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామపంచాయతీ తరుపున సహాయ సహకారాలు అందించాలని సూచించారు. లక్షలాదిగా తరలివచ్చే మల్లన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. దీనికి ముందు ఇందారం గ్రామపంచాయతీ దొరవారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా నిర్వహించిన అభివృద్ధి పనులు పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పరీక్షల తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేలాల గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ దేగ నాగేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరు



నవతెలంగాణ - కౌటాల

మండలంలోని తలోడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనిశెట్టి రాంచందర్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరయ్యారు. దంపతులకు పట్టువస్త్రాలు అందజేసి అభినందించారు. ఆయన వెంట ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, నాయకులు శ్రీనివాస్, సంతోష్, మధూకర్ ఉన్నారు.

డైట్ కళాశాలలో ధృవపత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



డైట్ కళాశాలల్లో ప్రవేశం కోసం శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మొదటి, రెండో విడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోని అభ్యర్థులకు శుక్రవారం కళాశాలలో ధృవపత్రాల పరిశీలన చేశారు. కాగా తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొని తమ సర్టిఫికెట్‌లను పరిశీలించినట్లు కళశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. అలాగే ఈ నెల 6 నుంచి 9 వరకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 14న సీట్ అలాట్‌మెంట్, 21న కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యార్థిని మృతిపై కలెక్టర్ పూర్తి స్థాయి విచారణకు అదేశించాలి

నవతెలంగాణ-నిర్మల్

సారంగాపూర్ మండలంలోని జాం గ్రామంలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని మహిత అనుమానాస్పదంగా మృతి చెందడం పట్ల జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాల నిర్వహణలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల బైంసాలో ఒక విద్యార్థి మృతి చెందడం జరిగిందని గుర్తుచేశారు. జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలల్లో కనీస భద్రత పరిమాణాలు లేకుండా పోయాయని విమర్శించారు. తక్షణమే విద్యార్థిని మృతి పట్ల విచారణ జరపాలని, ఈ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నిర్మల్

జామ్ గురుకులంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహిత మృతిపై సమగ్ర విచారణ జరిపి భాద్యులను కఠినంగా శిక్షించాలని ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్, ఉపాధ్యక్షులు నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రికి వెళ్లి మహిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 24 గంటలు వైద్య పరిరక్షణలో ఉండే మెడికల్ సిబ్బంది ఉండగా మహిత మృత్యువాత పడటం దారుణమైన విషయమని అన్నారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గమైందన్నారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మృతికి కారకులైన వారిని శిక్షించి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతులు దిగుబడినిచ్చే పంటలు వేయాలి



నవతెలంగాణ-నార్నూర్

రైతులు మంచి దిగుబడి ఆదాయానిచ్చే పంటలను వేయాలని డీఏఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని మారేగావ్, రూపాపూర్, ఖాండోవ్ గ్రామాల్లో పర్యటించి, పొలాల్లో రైతులు వేసిన పంటలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు వేసి నష్టపోకుండా మంచి ఆదాయం ఇచ్చే పంటలను వేసి అదాయాన్ని పొందాలన్నారు. అదేవిధంగా రైతుభీమా, పీఎం కిసాన్ కేవైసీ చేయని రైతుల వివరాలను, లబ్ది లందిపొందిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులతో కలిసి సేకరించారు. వారి వెంట ఏడీఏ రాథోడ్ గణేష్, ఏఓ దివ్య, ఏఈఓలు ఆత్రం నాగోరావ్, కళ్యాణి, కొండిబారావ్ ఉన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

ప్రతి నెల తనిఖీలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి పరిశీలించారు. భద్రత సంబంధిత విషయాలపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ స్రవంతి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది ఉన్నారు.

విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

విధులు నిర్వహిస్తు గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ శాఖలో విద్యుత్ తనిఖీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కరీమోద్దీన్ (53) శుక్రవారం మండల కేంద్రానికి చేరుకున్నారు. పలు ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని కుమ్మరితండ గ్రామంలో పలు ఇండ్లలో విద్యుత్ వైర్లను, విద్యుత్ పొల్‌లను తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు వెంటనే అధికారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న కరీమోద్దీన్ గుండెపోటుతో మృతి చెందడం పట్ల విద్యుత్ శాఖ అధికారులు సంతాపాన్ని తెలిపారు.

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని శంకర్‌గూడ, ముత్నూర్, ఏమాయికుంట తదితర గ్రామాల్లో ప్రజాగోస బీజేపీ భరోసాలో భాగంగా ఇంటింటికీ వెళ్లారు. బీజేపీని బలోపేతం చేయాలని ప్రజలను కోరారు. అనంతరం ముత్నూర్ గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయేది ఎన్నికల సంవత్సరం, ప్రతి కార్యకర్త గ్రామస్థాయి, బూత్ లెవెల్ నుంచి బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఇప్పటి నుంచే కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. తెలంగాణలో అధికారంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీడాం భీమ్‌రావు, రాథోడ్ భీమ్‌రావు, రాజవర్ధన్, రాజలింగం, దిలీప్ మోరే పాల్గొన్నారు.

వారం రోజులైనా..

ఆగని రిమ్స్ నర్సుల సమ్మె

- వేతనాలు చెల్లించే వరకు సమ్మెను విరమించేది లేదు
- రాత్రి అక్కడే తమ పిల్లలతో నిరసన తెలిపిన నర్సులు



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్స్‌ల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కంటిన్యూయేషన్ లెటర్లను ఇవ్వాలని ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. కాగా శుక్రవారం ఆరో రోజు 24 గంటల పాటు నిరసన తెలుపగా శుక్రవారంతో సమ్మె ఏడవ రోజుకు చేరుకుంది. గురువారం రాత్రి రిమ్స్ ఎదుట తమ పిల్లలతో చలిలో సైతం నర్సులు నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా సమ్మె శిబిరానికి రాత్రి ఆర్డీఓ రాథోడ్ రమేష్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, డాక్టర్స్ హెచ్‌ఓడీలు



వెళ్లారు. కంటిన్యూయేషన్ లెటర్ రేపటిలోగా వస్తుందని, రెండు మూడు రోజుల్లో వేతనాలు వస్తాయని హామీ ఇచ్చారు. అయిన కూడా వినకుండా తమ సమ్మెను కొనసాగించారు. కాగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, బీజేపీ నాయకులు పాయల శరత్ రాత్రి చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపి 12 గంటల వరకు ఉన్నారు. శుక్రవారం ఉదయం కంటిన్యూయేషన్ లెటర్ ను విడుదల చేశారు. వేతనాలు మూడు రోజుల్లోపు వస్తాయని వైద్యాధికారులు తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించేంత వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేసి నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏస్.నవీన్ కుమార్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీదర్, స్టాఫ్ నర్స్‌లు రాజ్యలక్ష్మి, కమల, మీనాక్షి, సురేఖ, శ్రీలత, కృష్ణకుమారి, అరుణ, పెర్సి, విశాల పాల్గొన్నారు.

నిర్మల్ మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన
- అరెస్ట్ చేసిన పోలీసులు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. డీస్పీ జీవన్‌రెడ్డి సముదాయించేందుకు ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో మహేశ్వర్‌రెడ్డితో పాటు నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ పేరుతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తన బంధువుల అక్రమ భూములను సక్రమం చేసుకునేందుకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సోఫీనగర్‌లోని సర్వే నెంబర్స్ 254, 255, 256, అలాగే సర్వే నెంబర్ 234, 235 గంగారెడ్డికి చెందిన భూమిని ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ పేరుతో కమర్షియల్‌ను రెసిడెన్షియల్ జోన్ లోకి, రెసిడెన్షియల్ జోన్‌లో వున్న భూములను గ్రీన్ జోన్‌లోకి, కొన్ని భూములను ఇండస్ట్రియల్ జోన్‌లోకి ఇష్టానుసారాంగా మారుస్తున్నారని అన్నారు. మంత్రి, మున్సిపల్ చైర్మెన్ విభిన్న ప్రకటనలు చేస్తూ, ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌పై ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, రైతులు, సామాన్య ప్రజలకు నష్టం కలిగించేలా చేస్తున్న డ్రాఫ్ట్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసే వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. న్యాయం వైపు నిలబడి ప్రజలకు సేవాలందించాల్సిన పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, మంజులాపూర్ కౌన్సిలర్ పురావస్తు చిన్నయ్య, నాయకులు చందు, పోశెట్టి, జమాల్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



నవతెలంగాణ-నిర్మల్

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణా పనులను త్వరితగతిన పూర్తి చేసి, సిద్ధం చేయాలని కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ సముదాయ భవన నిర్మాణం పనులను అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా బ్లాకుల వారిగా పూల మొక్కలను నాటాలని, భవన ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పచ్చదనంతో నిండిపోయి కళ, కళ లాడుతూ కనిపించాలని సూచించారు. రహదారుల నిర్మాణం పనులు, గ్రౌండింగ్, కాంపౌండ్ వాల్, లిఫ్ట్ పనులు పూర్తి చేయాలని అన్నారు. భవనంలోని అన్ని గదులకు తాగునీరు అందే విధంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, పెండింగ్ పనులను పూర్తి చేసి సిద్ధం చేయాలని అన్నారు. అంతకుముందు నూతన సమీకృత భవన గదులు, ఆవరణలో ఏర్పాటు చేస్తున్న నిర్మాణం పనులను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగాల్‌పేట్, నాగునాయిపేట్‌లలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి, మార్చి 01 లోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ లోకేష్, ఆర్డీఓ స్రవంతి, అర్ అండ్ బి ఈఈ అశోక్, పీఆర్ ఈఈ శంకరయ్య, డీసీఓ శ్రీనివాస్, హార్టికల్చర్ జిల్లా అధికారి శ్యామ్ రావ్ రాథోడ్ ఉన్నారు.

సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని విజయవంతం చేయాలని, ఫిబ్రవరి 15న ఒకే రోజు దేశం మొత్తంలో శ్రీసంత్ సేవాలాల్ జయంతిని జరుపుకోవాలని శుక్రవారం లంబాడీ లైవ్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ నాయక్ అన్నారు. జయంతి రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిని ఉద్దేశించి భారీ ఎత్తున ఫిబ్రవరి 12న చలో హైదరాబాద్ బంజారా భవన్‌లో గిరిజన లంబాడిల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ పిలుపు మేరకు జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని కొత్తపెల్లిలో చలో హైదరాబాద్ కరపత్రాలు విడుదల చేశారు. బంజారాలు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నుండి నాయకులు భారీ ఎత్తున హైదరాబాద్‌కి తరలి వచ్చి సేవాలాల్ జయంతిని విజయవంతం చేసే బాధ్యత గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి బంజారా ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు. ప్రతీ ఒక్కరూ వచ్చే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో గిరిజన లంబాడిల ఐక్యవేదిక నాయకులు రాథోడ్ నరహరి దాస్ నాయక్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వసంత్ రావ్ జాదవ్, ఆడే సునీల్, జాదవ్ మహేందర్, జాదవ్ గణపత్, చవాన్ సేవాదాస్, బానోత్ రవీందర్, జాదవ్ వినోద్, రాథోడ్ సందీప్, రాథోడ్ జైపాల్, జాదవ్ దయాకర్, జాదవ్ కవిత, జాదవ్ విద్యారాణి, శంకర్, కిరణ్ రవిందర్, సుధన్, సర్పంచ్ మధుకర్ రాథోడ్, ప్యాక్స్ చైర్మెన్ ఆడే సురేష్, జాదవ్ రెడ్డి నాయక్, యశ్వంత్ రావు, జాదవ్ బాబు, జాదవ్ సంతోష్, రోహిదాస్ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- బోధన ఉపకరణాల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేస్తూ అన్ని రంగాల్లో రాణించాలని డీఈఓ ప్రణీత సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని భవిత విలీన విద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బోధన ఉపకరణాలను విద్యార్థులకు అందచేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేశారు. మేరకు డీఈఓ ప్రణీత మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం సైతం పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ఉన్నత చదువులు చదవడానికి పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఉద్యోగాలలోనూ దివ్యాంగులకు రిజర్వేషన్ సౌకర్యాలు ఉన్నాయని, ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, భవిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వేతన జీవులను వంచించిన బడ్జెట్ : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా వేతన జీవులకు తీరని అన్యాయం చేసిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల్లో అధిక భాగం ఇప్పటికీ పాత రిజిమ్‌లోనే కొనసాగుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త రిజిమ్‌లో చేరేవారికి మాత్రమే రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చింది అని, పాత రిజిమ్‌లో ఉన్న సేవింగ్స్, మినహాయింపులు ఏవీ కూడా కొత్త రిజిమ్‌కి వర్తించవని తెలిపారు. దీనివలన ఉద్యోగులు కొత్త రిజిమ్‌లోకి మారినా సేవింగ్స్, మినహాయింపులు లేకపోవడం వల్ల పన్నుల భారం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను మోసం చేసిన బడ్జెట్‌గా తాము అభిప్రాయపడుతున్నామని అన్నారు. పైగా ఉద్యోగులకు ఊరట పేరుతో మీడియాలో ప్రచారం చేయడం ధారుణమని తెలిపారు. ఇప్పటికైనా ఈ మోసాన్ని పసిగట్టి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను ఉద్యోగులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలనీ వారు డిమాండ్ చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-లోకేశ్వరం

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలోని ముదిరాజ్ వాడలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దోళ్ల పోతన్న బోజవ్వలు నాట్లు వేయడం కోసం పంట పొలానికి వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ అయి ఇంటికి నిప్పు అంటుకుని కూన పెంకుల్లో నుండి మంటలు రావడంతో స్థానికులు గమనించారు. వెంటనే అప్రమత్తమై బాధితునికి ఫోన్ చేసి సమాచారం అందించారు. బాధితుడు ఇంటికి చేరుకునే సమయానికి ఇంట్లో ఉన్న టీవీ, రూ. 8వేల నగదు, విలువైన సామాన్లు కలిపి రూ.50వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి తనకు నష్టపరిహారం అందించాలని కోరారు.

అగ్నివీర్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన అగ్నివీర్ ఫలితాలలో ఆదిలాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న తేజస్ అనే విద్యార్థి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో తేజస్‌ను సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవకై తమ కళాశాల విద్యార్థి నేను సైతం అంటూ బయలుదేరడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కళ్యాణ వేడుకలు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని పిప్రి గ్రామంలో శుక్రవారం శివాలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల పల్లకిని మోస్తూ, శివమాలధారణ స్వాములు భజనలు, కీర్తనలతో నృత్యాలు చేస్తూ గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల శివమాలధారణ స్వాములు, గ్రామ, మండల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉపాధ్యాయుల ధృవపత్రాలు పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, స్పౌజ్ బదిలీల ప్రక్రియ జోరందుకుంది. తాజాగా జిల్లాలో బదిలీ కోసం మొత్తం 1585 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి నాలుగు రోజుల జిల్లా స్థాయిలో దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో జిల్లా స్థాయి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఇందుకు గాను ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. కాగా అర్హుల జాబితను 7, 8 తేదీల్లో ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

నూతన వంతెనను నిర్మించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని మన్మద్, హావర్గ గ్రామాలకు వెళ్లె రహదారిలో ఉన్న సుద్ద వాగుపై ఉన్న వంతెన శిథిలావ్యస్థలో ఉందని నూతన వంతెనను నిర్మించాలని టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు, ముధోల్ మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లడానికి ప్రధానమైన వంతెన అన్నారు. శిథిలావస్థకి చేరి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారిందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. నూతన వంతెన నిర్మాణం చేపట్టి మండల ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

ఉపన్యాస పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నెహ్రూ యువ కేంద్రం, ఖమ్మం వారి ఆధ్వర్యంలో గత నెల 28న కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయిఉపన్యాస పోటీలలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏప్రథమ సంవత్సరం విద్యార్థి కె వైకుంఠం జిల్లా నుండి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. 'పర్యావరణ కాలుష్యం-మానవ జీవితంపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడిన వైకుంఠం అద్భుత ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికై ఆ పోటీలలో కూడా గెలుపొందితే రూ. 2 లక్షల నగదు బహుమతిని విద్యార్థికి అందిస్తారని ఆయన వివరించారు.

మురిమడుగులో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని మురిమడుగు గ్రామపంచాయతీలో శుక్రవారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఆ గ్రామ సర్పంచ్ ఇంధనపల్లి భాగ్యలక్ష్మి రాజలింగుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు పేదలకు ఎంత ఉపయోగమన్నారు. గ్రామస్తులు తప్పనిసరిగా తమ కండ్లను పరీక్ష చేయించుకోవాలన్నారు. పరీక్షల అనంతరం ఉచితంగా కండ్ల అద్దాలు ఇస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాడి భూమక్క జగన్, ఎంపీవో రమేష్, యువ నాయకులు సందీప్, మాజీ సర్పంచ్ రాంచందర్‌రెడ్డి, కమలాకర్‌రావు, వీడీసీ చైర్మన్ భూమాచారి, లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెంగాని వెంకటేష్, నర్సయ్య, సదన్న, గ్రామ సెక్రటరీ జంగు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



నవతెలంగాణ-మంచిర్యాల

విద్యార్థులకు క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనస్సు శరీరం ఆరోగ్యంగా ఉంటేనే మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతామని అన్నారు. ప్రయివేట్ పాఠశాలలు కేవలం విద్యకే పరిమితం కాకుండా ఆటల పోటీలలో పిల్లల్ని వారి నైపుణ్యతను వెలికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు అభినందించారు. రానున్న కాలంలో ట్రస్మా ఆధ్వర్యంలో ఒక క్రీడల క్యాలెండర్ ఇయర్‌ను తయారుచేసి మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్‌రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వడ్నాల శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ పర్సనల్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి శరత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మచరణ్, సిద్దయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రమోహన్‌గౌడ్, స్పోర్ట్స్ సెక్రటరీ పెంచాల శ్రీధర్, పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, పోటీల నిర్వాహకులు వై బాలాజీ, ఉప్పలయ్య, విక్రమ్‌రావు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్టు అందజేత



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

యువకులు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ విజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్టును సర్పంచ్ మధునయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ ప్రసంగానికి జిల్లా నాయకులు హాజరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడ్జెట్ సమావేశాల సందర్భంగా మొదటి రోజు గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ ప్రసంగానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు హాజరయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రుద్రపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ పుష్ప గత 8 నెలల క్రితం అనారోగ్యం గురయ్యారు. వీరు సీఎం రిలీఫ్ ఫండ్ కొరకు దరఖాస్తు చేసుకోగా శుక్రవారం రూ.56 వేల చెక్కును లబ్దిదారులకు ఎంపీపీ డుబ్బుల నానయ్య ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొట్రంగి నగేష్, నాయకులు బండ రమేష్, మోర్ల బాబురావు, మేకల కోటేష్, దుర్గం హరిదాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ముత్యాల స్వప్నరాజయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్యామ్, సెక్రటరీ మౌనిక, ఏఎంసీ డైరెక్టర్ మంజులరెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు వెంకటేష్, మాజీ సర్పంచ్ ప్రేమకుమార్, కోఆప్షన్ ఈర్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సాంకేతిక విద్య పరీక్ష హాల్ టికెట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాంకేతిక విద్య పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్స్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11 నుండి 14 వరకు నిర్వహించడం జరుగుతుందని హాల్ టికెట్స్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

10న భారత్ బచావో జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 10న ఆసిఫాబాద్‌లోని రాయి సెంటర్‌లో భారత్ బచావో జిల్లా సదస్సును నిర్వహించనున్నట్లు రైతు జేఏసీ జిల్లా అధ్యక్షులు, భారత్ బచావో జిల్లా ఇన్‌ఛార్జి సోయం చిన్నన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మతోన్మాదానికి వెన్నెముకలా ఉన్న కులాధారిత భూస్వామ్య విధానంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దళితులు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. బారత్ బచావో అణగారిన ప్రజల పక్షపాతిగా ఉంటూ ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం కోసం పోరాడుతోందని అన్నారు. ఈ సదస్సుకు జాతీయ ప్రతినిధి ఎంఎఫ్ గోపినాథ్, రాష్ట్ర ప్రతినిధులు గాదె ఇన్నయ్య, జంజెర్ల రమేష్ హాజరు కానున్నట్లు తెలిపారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-మంచిర్యాల

పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని ప్రజా సంఘా పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిందని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ,ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షు ఇచ్చే విధంగా బడ్జెట్ పెట్టాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వాళ్లకు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయాలని కోరారు. వరద బాధితులకు పూర్తిగా సాయం అందలేదని, ఇప్పటికీ బాధితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, శేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తిరుపతి, కేవీపీఎస్ జిల్లా



కార్యదర్శి డి. మోహన్, అభినవ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి, పలువురు పేదుల పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.2వేల వేతన జీవో వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు శారదతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులకు 2000 ఇచ్చే వేతనాలకు సంబంధించిన జీవో వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంతో కష్టపడి వంట చేసినా బిల్లులు నెలనెల రావడం లేదన్నారు. దీంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వం అన్ని రకాల సరుకులను సప్లై చేయాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, మధ్యాహ్నం భోజన కార్మికులకు కొత్త వంటపాత్రలు, మంచినీళ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ నాయకుల, పాఠశాల ప్రధానోపాధ్యాయుల వేధింపును ఆపాని, మధ్యాహ్న భోజనం వర్కర్లకు నాలుగు జతల యూనిఫాం ఇవ్వాలని, నెలకు సరిపడా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడి మాయ, నాయకులు రూప, విజయ, విమల, లక్ష్మి, కమల, తుకారం, సుజాత, సాయమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

న్యూమోకొనియోసిస్ వ్యాధి అవగాహన ముగింపు కార్యక్రమం

నవతెలంగాణ-నస్పూర్

భూగర్భగనుల్లో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు వచ్చే ఊపిరితిత్తులకు (న్యుమోకోనియోసిస్) సంబంధించిన వ్యాధుల నిర్ధారణ, వ్యాధి నివారణ చర్యలపై మొదటి జోనల్ వర్క్‌షాపు శుక్రవారం సీసీసీ గెస్ట్ హౌస్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కౌశిక్ సర్కార్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మెడికల్) నాగపూర్, డాక్టర్ జాన్ జార్జి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మెడికల్) హైదరాబాద్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి వెంకటేశ్వరరావు, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కౌశిక్ సర్కార్ మాట్లాడుతూ ఈ వర్క్ షాప్ వలన మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు అందరూ న్యూమోకోనిసిస్ వ్యాధి సంబంధిత లక్షణాలను ఆయా ఏరియాలో ఉండే పరిస్థితులను ఒకరికొకరు పంచుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించుకోవడానికి ఆయా గనుల యాజమాన్యం ముందుకు రావాలని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లు శ్రీరాంపూర్ ఏరియాలో మొదటగా ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని, సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో



సంస్థలో పనిచేస్తున్న డాక్టర్లందరూ 24గంటలు పని చేయడం అభినందించదగిన విషయమని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన డాక్టర్లు, మెడికల్ సిబ్బందినా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పి రమేష్ బాబు, కిరణ్‌రాజ్‌కుమార్, ఉష, పద్మజ, శౌరి, వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్ నుండి నలుగురు డాక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - వాంకిడి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ కౌసల్యకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ మండలాధ్యక్షురాలు ఉమాదేవీ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 70వేల మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారని, వీరంతా మహిళలే అని తెలిపారు. 40ఏండ్లకుపైగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. వీరికి కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని, కానీ ప్రభుత్వం నేటికి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. దీంతో అంగన్‌వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్డ్ బెన్‌ఫిట్ రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షల ఇవ్వాలని, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విమల, లక్ష్మీబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎస్‌తో ఎమ్మెల్యే భేటీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారిను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రాజధాని బీఆర్కే భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జీవో 3 పునరుద్ధరణకు కృషి చేయాలని, ప్రస్తుత ప్రమోషన్‌లలో షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనీ కోరారు. ఆదివాసీ నిరుద్యోగ యువతి యువకుల కొరకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రతి జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని, వ్యవసాయ అభివృద్ధికి సీఎం గిరివికాస్ పథకం ద్వారా అధిక నిధులు కేటాయించాలన్నారు. గిరిజన ప్రాంతాల సబ్ సెంటర్లను పల్లె దావఖానలుగా మార్చి స్థానిక గిరిజన నిరుద్యోగులతో జీఎన్ఎం, ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని, గిరిజన గ్రామ పంచాయతీలకు, చిన్న గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, హైమన్ డార్ఫ్



జ్ఞాపకార్థం జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో ఆదివాసీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. దీనికి ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ రాజేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చి జీవనోపాధి పొందుతున్న వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారులతో వలస కార్మికుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి వలస కార్మికుని వివరాలు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని వివిధ పరిశ్రమలలో వివిధ రాష్ట్రాల నుండి వలస వచ్చిన కూలీలు పనిచేస్తున్నారని, వారి వివరాలను సేకరించి ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. వలస కూలీల పిల్లల సంక్షేమం కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇతర అసంఘటిత రంగాలకు చెందిన కూలీలు వారి వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు.

గంగాపూర్ జాతరకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి నుండి మూడు రోజుల పాటు రెబ్బెన మండలం గంగాపూర్ జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నుండి 10 బస్సులు, కాగజ్‌నగర్ నుండి 8 బస్సులు, బెల్లంపల్లి బజార్, మార్కెట్ నుండి 8 బస్సులు నడపనున్నట్లు, ఆసిఫాబాద్ నుండి గంగాపూర్‌కు బస్సు చార్జి పెద్దలకు రూ. 60, పిల్లలకు రూ.30, కాగజ్‌నగర్ నుండి గంగాపూర్‌కు బస్సు చార్జి పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30, బెల్లంపల్లి మార్కెట్ నుండి గంగాపూర్‌కు బస్సు చార్జి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెబ్బెన : ఆసిఫాబాద్ డిపో ఆధ్వర్యంలో గంగాపూర్ జాతర ఉత్సవాలకు ఆసిఫాబాద్ నుండి 10, కాగజ్‌నగర్ నుండి 8 బస్సులు, బెల్లంపల్లి మార్కెట్ నుండి 8 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నుండి గంగాపూర్‌కు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30, కాగజ్‌నగర్ నుండి గంగాపూర్ వరకు పెద్దలకు రూ.60, చిన్న పిల్లలకు రూ.30, అదేవిధంగా బెల్లంపల్లి మార్కెట్ నుండి గంగాపూర్ వరకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40 చార్జీ ఉంటుందని తెలిపారు.

సీఏ ఫౌండేషన్ కోర్సులో విజయకేతనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2021-22 విద్యాసంవత్సరంలో 12వ తరగతి పూర్తి చేసిన నలుగురు విద్యార్థులు సీఏ ఫౌండేషన్ కోర్సులో ఉత్తీర్ణత సాధించినట్లు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి తెలిపారు. డిసెంబర్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన సీఏ ఫౌండేషన్ కోర్సు పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల కాగా విద్యార్థులు డి శ్రీజ, వి అభిరాం, పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మి ప్రణీత్‌లు ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు. ఈ విద్యార్థులు డిగ్రీతో పాటే సీఏ కోర్సులో జాయిన్ కావచ్చని ఆయన తెలిపారు.

జాతర పనులను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-రెబ్బెన

ఈ నెల 4, 5, 6వ తేదీల్లో మండలంలోని గంగాపూర్ గ్రామంలో జరిగే శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర పనులను శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. ఆమె వెంట జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాదం సంజీవ్, నంబాల సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ మధునయ్య, డైరెక్టర్ వినోద్ జైస్వాల్, బీఆర్ఎస్ నాయకులు మాన్యం పద్మ, అన్నపూర్ణ, అరుణ, మురళీ ఉన్నారు.

అదనపు ఎస్పీ సైతం..

బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర పనులను అదనపు ఎస్పీ(ఎడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్ సైతం పర్యవేక్షించారు. జాతర సందర్భంగా వివిధ జిల్లాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. వారి వెంట రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ ఎల్ భూమేష్, ఆలయ చైర్మన్ వెంకటేశం చారి, సర్పంచ్ పందిర్ల వినోద మధునయ్య, డైరెక్టర్‌లు వినోద్ జైస్వాల్, రాపాల శ్రీనివాస్, సర్పంచ్ శ్యాంరావు, బీజేవైఎం ఇగురపు సంజీవ్, ఈఓ బాపురెడ్డి ఉన్నారు.

పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని 4 నుండి 8 నెలల వయస్సు గల ఆవు దూడలు, గేదె దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారి డాక్టర్ రాకేష్ శుక్రవారం వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల కమల, జూనియర్ వెటర్నరీ అధికారి సురేష్, సిబ్బంది శివ, సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ -వేమనపల్లి



మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి నియోజకవర్గ ప్రభారీ అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, మండల ఇంచార్జి జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో వేమనపల్లి మండలం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని, ఇప్పటివరకు పాలించిన పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్ల సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరచి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, బట్టు మల్లేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కుబిడే అంజి, నాయకులు దుర్గం పుల్లయ్య, కొండ రవి, భీమేష్, పందుల అశోక్, రాజు పాల్గొన్నారు.

నేడు బాలాపూర్‌లో సాంస్కృతిక భజన పోటీలు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని బాలాపూర్ గ్రామంలో శివాలయంలో గురుమూర్తి శ్రీ భూమయ్య 43వ పుణ్యతిథి సందర్భంగా శనివారం ఉదయం 11గంటల నుండి సాంస్కృతిక భజన పోటీలు నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్ తెలిపారు. ఆసక్తి గల కళాకారులు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి నగదు రూపంలో బహుమతులను అందజేస్తామన్నారు. మొదటి బహుమతి రూ.11వేలు, రెండవ బహుమతి రూ.7వేలు అందజేస్తామని పేర్కొన్నారు

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

శనివారం 04 ఫిబ్రవరి 2023

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సత్తు యశశ్విని కరాటేలో జాతీయ స్థాయిలో వెండి మెడల్ సాధించినందుకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మండల కేంద్రంలోని తన నివాసంలో శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా తాను వెన్నంటి ఉంటానన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు సత్తు ఉమాపతి-సుమలత ఉన్నారు.



జిల్లాలోని అన్ని వసతిగృహాలను సందర్శించాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని అన్ని వసతిగృహాలను ఉదయం నుండి అధికారులు ఫీల్డ్‌లో ఉండి సందర్శించాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మినీ సమావేశం మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వసతిగృహాలను సందర్శించి బ్రేక్ ఫాస్ట్, డిన్నర్ చేసి ఫుడ్ క్వాలిటీ ఎలా ఉందో చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా, మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా ప్రతీ రోజు హాస్టల్ విజిట్ చేసి పిల్లలతో మాట్లాడాలని అన్నారు. ఏమైన సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలని అన్నారు. సానిటేషన్ బాగుండాలని, టాయిలెట్స్, కిచెన్ స్టోరేజ్ పరి శుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. అనారోగ్యం బారిన పడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలని అన్నారు. ఏరోజు పని ఆరోజే పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉంచరాదనీ స్పష్టం చేశారు. సఖి కేంద్రాలు అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. సఖి కేంద్రం ద్వారా 108 పోస్టర్‌లను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేయాలన్నారు. సఖి కేంద్రాల ద్వారా చేస్తున్న పనుల వివరాలను అడిగి తెలిసుకున్నారు. డ్రాపవుట్ పిల్లలను గుర్తించాలని అన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

• డీఎస్పీ నాగేందర్



నవతెలంగాణ-ఉట్నూర్

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరంగా కృషి చేస్తామని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ ఏఎస్పీగా విధులు నిర్వహించిన హర్ష వర్ధన్ బదిలీపై వెళ్లగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ డీఎస్పీగా విధులు నిర్వహించే నాగేందర్‌ను ఉట్నూర్ డీఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా ఆయన శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ రాకతో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని అన్నారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్తున్నామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించబోమని అన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు, ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో మోసాలు చాలా జరుగుతున్నాయని, మోసలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలకైనా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. శాంతి స్థాపనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. డీఎస్పీ వెంట సీఐ సైదారావ్ ఉన్నారు.

వడ్రంగి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-బేల

వడ్రంగి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వడ్రంగి కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కుల సంఘ భవనానికి మరో ఐదు లక్షలతో పాటు గ్రామాల్లోని కులస్తులకు డబుల్ బెడ్‌రూంలో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. మండలంతో పాటు జైనథ్ మండలంలోని వడ్రంగి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, జక్కుల మధుకర్, తేజ్ రావ్ మస్కె, దేవన్న ఒళ్లపవార్, సునీల్ గోడం, సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, తహసీల్దార్ బడాల రాంరెడ్డి హాజరయ్యారు. మండల వడ్రంగి సంఘ అధ్యక్షుడు అభయ్ మానుస్మారే, నాయకులు రాకుండే వెంకటి, జ్ఞానేశ్వర్, దయాకర్ విష్ణుదాస్, గజానన్, అనిల్, అశోక్ వికాస్, వివిధ గ్రామాల నుండి వచ్చిన కుల బాంధవులు పాల్గొన్నారు.

ఖైదీలకు కంటి వెలుగు పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా జైలులో ఖైదీలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా జైలు లో చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, జైలు పర్యవేక్షణ అధికారి అశోక్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 128 మంది ఖైదీలకు, 30 మంది సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను, మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ కుమార్, డాక్టర్ శిల్ప, డాక్టర్ ఈశ్వర్, పారామెడికల్ సిబ్బంది, జైలర్ సూర్య ప్రకాష్ రెడ్డి, డిప్యూటీ జైలర్ ప్రకాష్, కృష్ణ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలి

• డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది నిరుపేదలు ఇంటి స్థలాలు, ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు, ఇండ్లు ఇస్తామని హామీలు ఇచ్చి మర్చిపోయిందని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఉన్న పేదలకు మూడు లక్షల రూపాయలు ఇస్తామని, స్థలం లేని వారికి ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. దాన్ని అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లాలోని కొన్ని చోట్ల డబుల్ బెడ్ రూములు పూర్తి చేసినప్పటికీ పేదలకు అందని ద్రాక్షలాగే ఉన్నాయన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికీ ఏ మండలంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణమే లేదని అన్నారు. ప్రభుత్వ హామీ మేరకు జిల్లాలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు పూర్తయిన డబుల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గెడం టికనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి



పురుషోత్తం, దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి, తాళ్ల పెల్లి రాజేశ్వర్, చల్లురి వంశీ, నాయకులు నగేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణలక్ష్మి

• ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



నవతెలంగాణ - కౌటాల

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి పథకం ఒక వరమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కళ్యాణలక్ష్మి, షాదీముభారక్, రైతుబీమా లాంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడరక ముందు ఆడబిడ్డలున్న తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేయాలంటే కట్నకానుకలు ఇవ్వడానికి చాలా ఇబ్బందులు పడేవారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పేదవారి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని ఆడబిడ్డల పెండ్లి కోసం కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి రూ.1.116 లక్షలు అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని అన్నారు. కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న 86 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కేసీఆర్ పేదవారికి పెద్దన్నగా వ్యవహరిస్తున్నారని, ఆడబిడ్డలున్న తల్లిదండ్రులు అధైర్యపడొద్దన్నారు. రైతు బీమా కింద 8 బాధిత రైతు కుటుంబాలకు బీమా ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానెపెల్లి ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, తహసీల్దార్ మునావర్ షెరీఫ్, ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, నాయకులు మధుకర్, చింతలమానెపెల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డుబ్బుల వెంకయ్య పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం



నవతెలంగాణ - వాంకిడి

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి రమేష్ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం వంద మంది కూలీలకు పని కల్పించాలని, పత్తి సీజన్ అయిపోవస్తున్నందున లేబర్ రిపోర్టు పెంచాలని, అన్ని గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న డంపింగ్‌యార్డులో పంచాయతీ నుండి సేకరించిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేయాలని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువు వాడకం ద్వారా కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని ప్రతి కూలీ ఆధార్‌కార్డు, వారి జాబ్‌కార్డులకు అనుసంధానం చేయాలని, ఇక నుండి కూలీలకు కిసాన్ కార్డు అనుసంధానం ద్వారానే వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ జాకీర్ హుస్మానియా పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మండలంలోని గుల్లకోట, చందారం గ్రామాల్లోని మన ఊరు-మన బడి, కంటి వెలుగును శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యం, శ్మశానవాటికల వాడకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, కంపోస్ట్ షెడ్‌ల నిర్వహణ గురించి ఎంపిడిఓ నాగేశ్వర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఇంచార్జ్ డీపీఓ ఫణిందర్, ఎంఈఓ రవీందర్, సర్పంచ్‌లు గోళ్ల రవీందర్, బానోత్ జయంత్, ఎంపీఓ ప్రసాద్, పీఆర్ ఏఈ శృతి, పంచాయతీ కార్యదర్శులు సురేష్, శ్రీలత పాల్గొన్నారు.

నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పల్లెల ప్రగతికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు. పల్లెల్లో పాడైపోయిన పంచాయతీ భవనాలు గుర్తించి, ప్రత్యేక నిధులు మంజూరు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. అందులో భాగంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సిర్గాపూర్ పంచాయతీ భవనాన్ని ప్రత్యేకంగా గుర్తించి, నూతన పంచాయతీ భవనానికి ఇరువై లక్షల నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, వైస్ ఎంపీపీ బాపురావు, ఎంపీటీసీ ఎ.రవీంధర్ రెడ్డి, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ అజీజ్ ఖాన్, వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ

పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సాత్‌నెంబర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాత్‌నెంబర్ గ్రామానికి చెందిన బిషే దిగంబర్(35) గత కొంత కాలంగా మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగులమందు తాగి, నీరసంగా వాంతులు చేసుకుంటున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. భార్య రేణుకా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింబద్రీ తెలిపారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన మోడెపు ఉమాకాంత్(35) పెయింటర్ మద్యానికి బానిసై శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు ఉమాకాంత్ గత కొద్ది నెలల నుండి మద్యానికి బానిస కావడంతో భార్య ఇంట్లో లేకపోవడంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడికి భార్య ఆరు సంవత్సరాల కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు.

7న మైనార్టీల చేయూత పథకానికి లక్కీడ్రా

నవతెలంగాణ-నార్నూర్

మైనార్టీలకు ఆర్థిక సాయం అందజేయుటకు 2022-23 సంవత్సరముకు గాను అల్ప సంఖ్యకవర్గ లబ్ధిదారులు ఆర్థిక సాయం పొందుటకు ఒబిఎంఎంఎస్ ద్వారా 138 మంది లబ్ధిదారులు ధరఖాస్తులు చేసుకున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ కావల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటి వరకు 48 మంది లబ్ధిదారుల ధరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయానికి అందాయన్నారు. మండలానికి రెండు యూనిట్లు మంజూరైన సందర్భంగా లబ్ధిదారులు అందజేసిన ధరఖాస్తుల పరంగా ఈనెల 7న మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 12లకు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ధరఖాస్తు చేసుకున్న మైనార్టీ లబ్ధిదారులు లక్కీ డ్రాలో పాల్గొనాలని కోరారు.

కళ్యాణ మండపానికి భూమిపూజ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న మున్నూరుకాపు సంఘ కల్యాణ మండపానికి శుక్రవారం సర్పంచ్ చెన్న మహేష్, గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కాల్వ లింగన్న, ముధోల్ తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోల్ల రమేష్ కలిసి భూమిపూజ చేశారు. మున్నూరు కాపులు కలిసి మెలిసి ఉంటూ మన ఆశయాన్ని సాధిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లమాడ సంఘం ఉపాధ్యక్షులు తోట లస్మన్న, కార్యదర్శి మంద రమేష్, కోశాధికారి కూర ముత్యం, సహా కార్యదర్శి రావుల మల్లేష్, సంఘం సభ్యులు కె.భాస్కర్, పీఏసీఎస్ చైర్మెన్, సట్ల గజ్జరాం, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ లక్ష్మణ్, ఎల్.గంగాధర్, కె.రమేష్, బి.విజయ్, నర్సాపూర్ ఎంపీపీ కొండ్ర రమేష్, కుంటాల, లోకేశ్వరం, భైంసా, కుబీర్ మండలాల మున్నూరుకాపు సంఘాల అధ్యక్షులు ఒడ్నం గోవింద్ రాజు, మంద లింగన్న, మోహన్, సిద్ధంవార్ వివేకానంద్ మండలంలోని పలు గ్రామాల మున్నూరుకాపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కె.విశ్వనాథ్ మరణం పట్ల మంత్రి సంతాపం

నవతెలంగాణ-నిర్మల్

ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం పట్ల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. భారతీయ, తెలుగు సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను కథలుగా ఎన్నో అద్భుత సినిమాలు చేశారని కొనియాడారు. ఆయన చేసిన సినిమాలు తెలుగు చలనచిత్ర రంగానికి ఎనలేని ప్రతిష్ఠను తెచ్చాయని పేర్కొన్నారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.